# మంచి రోజులు



(రచయిత)

*

రచన : శ్రీ బెహరా ఉమామహేశ్వరరావు

రచ్చబండ దగ్గర పాతమిత్రులు చేరారు. ఇంకా మాటలకేం కొదువ. మాటలు సాగి పోతున్నాయి.

"ఏం చౌదరీ! ఆ రోజులు మరల వస్తాయంటావా?" అని అడిగాడు శాస్త్రులు.

చౌదరి చుట్ట పట్టిస్తూ "ఎందుకూ?" అని దీర్ఘం తీస్తూ అడిగాడు.

"ఆ రోజులు ఎంత హాయిగా ఉండేవి!" కాస్త పొడుం బిగుస్తూ అన్నాడు శాస్త్రులు.

"అంటే, మరల దేశం అస్వాతంత్ర్యం కావాలంటావు. ఏ అమెరికా, రష్యా కాని దేశాన్ని దోచుకోవాలంటావు." కోపంగా కళ్ళెర్ర చేసాడు చౌదరి.

"ఏమిటోయ్ చౌదరీ? ప్రతి దానికి పెడార్థం తీసి, అగ్గి మీద గుగ్గిలం అవుతావు." అన్నాడు శాస్త్రులు.

"కాదంటే ఏమిటి నీ మాటలు?" కాస్త తగ్గుతూ అన్నాడు చౌదరి.

శాస్త్రులు మాట సర్దుకుంటూ, "మిత్రమా! నేను పరాయి పాలనకు వ్యతిరేకినే, కాని మనవాళ్ల పరిపాలనలో కొందర్ని పరాయి వాళ్లుగా చూడడం నేను మాత్రం సహించలేక పోతున్నాను" అన్నాడు.

చౌదరి పొగ విడుస్తూ, "అంటే?" అన్నాడు.

"చూడు, చౌదరీ! మనం చదువుకున్న రోజుల్లో ప్రతిభకు విలువ ఉండేది. కాదంటావా?"

"అయితే?"

"ఈ రోజుల్లో కులాన్ని బట్టి చదువులు, కులాన్ని బట్టి ఉద్యోగాలు....అహా! ఇది పరాయి పాలన కాదుగాని...." అంటూ నశ్యం గట్టిగా లాగించాడు శాస్త్రులు.

చౌదరి చుట్ట ఎర్రగా కాలుస్తూ, "ఏమిటి రిజర్వేషన్ను గురించేనా నీవు చెప్పేది?" అంటూ నోటిలో నుండి పొగ విడిచాడు.

"అదేనయ్యా, నేను చెప్పేది!" అన్నాడు శాస్త్రులు.

నోటిలో చుట్ట బయటకు తీసి పుతుక్కున ఇంత ఉమ్మి, "ఏమిటో ఈ దేశంలో మంచిరోజులు ఎప్పుడు వస్తాయో?" అన్నాడు.

* * *

ఆ రోజు యూనివర్సిటీ పనిమీద వెళ్లాను. మా మిత్రుని కొడుకు యూనివర్సిటీలో పి. జి. చదువుతున్నాడు. ఎలాగా వచ్చాం కదా - వాడ్ని చూసి పోదాం అనుకొని రూమ్‌కి వెళ్ళాను. వాడు లేదు. భోజనానికి వెళ్ళాడు.

రూమ్‌లో ఫ్రెండ్సు, "వాడు వచ్చేస్తాడు. మీరు కూర్చోండి!" అంటూ కుర్చీ చూపించారు.

కుర్చీలో కూర్చున్నాను. వాళ్ళంతా రిజర్వేషన్ను గురించి మాట్లాడుకుంటున్నారు.

ఒక విద్యార్థి నా దగ్గరకు చేరి, "చూడండి, మీకు సురేష్ ఏమవుతాడు?" అని అడిగాడు.

"మా స్నేహితుడికి కొడుకు లెండి. చూసి పోదాం," అని వచ్చాను" అన్నాను.

"పాపం!" అంటూ ప్రక్కకు తిరిగాడు.

"ఏం ?" అని నేను ప్రశ్నించాను.

"చూడండి ! రిజర్వేషన్సు మీద మీ అభిప్రాయం ఏమిటి ?" అని సూటిగా నన్ను ప్రశ్నించాడు.

"తప్పక ఉండాలి బాబూ !" అని సమాధానం ఇచ్చాను నేను.

"ఏమిటి ?" అంటూ తీవ్రంగా చూసాడు ఆ విద్యార్థి.

"ఏం బాబూ ! మనం దూర ప్రయాణాలు చేసేటప్పుడు రైల్వే రిజర్వేషన్స్ లేకపోతే ఎలా ?" అని నేను చెప్పే సరికి___

అందరూ గొల్లుమని నవ్వారు. రూమ్ అంతా నవ్వులతో మారుమ్రోగింది. నేను నవ్వేసాను.

"ఆ రిజర్వేషన్సు గురించి కాదు బాబూ, మేము మాట్లాడేది !" అని చెప్పాడు ఒక విద్యార్థి.

నేను నవ్వుతూ, "నాకూ తెలుసు బాబూ ! అయినా ఆ ఊబిలోకి నన్ను ఎందుకు లాగుతారు ?...." అని సరిపెట్టేసాను.

బస్సులో కూర్చున్నాను. బస్సులో సీటింగు మాత్రం నిండింది.

ప్రయాణీకులు ఉద్యోగాలలో రిజర్వేషన్సు గురించి మాట్లాడుతున్నారు. ఉండాలని కొందరు, కూడదని కొంత మంది చెబుతున్నారు. పంచె కట్టుకొని, కమీజు, పై వారికి వేసుకున్న ఒక నడి వయస్సుగల పెద్దమనిషి, "ఉద్యోగాల్లో రిజర్వేషన్సు తప్పక వుండాలి !" అన్నాడు.

"ఎందుకు ?" అని మరొకరి ప్రశ్న.

పెద్దమనిషి, "అగ్ర కులాలవారు, దేశ ప్రజల్ని దోచుకు తిన్నన్నాళ్ళు ...తిన్నారు కదా ! ఇప్పుడు వెనుకబడిన కులాల వారికి చేయూత ఇవ్వకపోతే ఎలా ?" అన్నాడు.

"చూడండి, నిజంగా ఈ రిజర్వేషన్సువల్ల ఏమీ ప్రయోజనం లేదు." అని మరొకడు చెప్పాడు.

"ఏం ?" అంటూ పెద్దమనిషి ప్రశ్నించాడు.

"గుడిసెల్లో ఉండేవాడు అలాగే వుంటున్నాడు. ధనికులే లాభం పొందుతున్నారు."

"ఎలా ?"




శ్రీ లక్ష్మి వారి
వెట్ గ్రైండర్స్

గత
23 సంవత్సరాల నుంచీ
ప్రసిద్ధి చెందినది.

బపితా వారి...
ప్రత్యేక తయారింపులు
• సీఫోర్, • చూస్త్రీ,
• రావ్ టూ, • సెలెక్ట్ ఒన్
• దట్ సెలెక్షన్.
ఇవే మా ప్రత్యేక తయారింపులైన
జెట్టీలు - బనియన్లు.
తయారించువారు :
Phone : 22909
BAPITA KNITTERS
Lakshmi Nagar, Tirupur-638 602.

"ఈ రిజర్వేషన్స్‌లో భూస్వాములు, వ్యాపారులు, వకీళ్ళు, ప్రైవేటు డాక్టర్లు తమ ఆదాయం తక్కువ చూపించి రిజర్వేషన్సులో ప్రయోజనం పొందుతున్నారు. బీదవాడు. కనీసం కాలేజికి కాదు; పెన్సు కూడా చెప్పించుకో లేని స్థితిలో ఉన్నాడు."

"కనీసం కొద్దిమంది అయినా లాభం పొందుతున్నారు. ఆ మాత్రం బీద కుటుంబాలయినా బాగు పడుతున్నాయి కదా!" అని పెద్దమనిషి వాక్యాలం.

బస్సు ఇంతలో ఆగింది,

"కొద్దిమంది బీదవాళ్ళా! నా బొందా!" అంటూ ఆ మనిషి దిగిపోయాడు.

* * *

బడిలో చేర్చడానికి వెళ్లాడు రామయ్య. ప్రవేశ దరఖాస్తు హెడ్మాష్టరు ఇచ్చారు. రామయ్య పూర్తిచేసి హెడ్మాష్టారికి అందించాడు. అతడు ఆశ్చర్యపడుతూ, "వీడు మీ కొడుకు కాదా?" అని ప్రశ్నించాడు.

"మా వాడే!" అని చెప్పాడు రామయ్య.

"అయితే గార్డియన్ పేరు నింపి ..."

"అవును సార్! నేను ఉద్యోగం చేస్తున్నాను. నా ఆదాయం పన్నెండు వేలకి మించింది. వాడి భవిష్యత్ పాడు చేయడం నాకు ఇష్టంలేదు" అన్నాడు రామయ్య. పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులకు ఇటువంటి కేసులు మామూలే.

* * *

స్కూలుకి ఆరోజు రంగారావుగారు వచ్చారు. వారిది బేక్‌వర్డ్ కేస్ట్. ప్రధానోపాధ్యాయుడు ప్రవేశ దరఖాస్తు తీసి, "మీ చిన్న అబ్బాయి రాజుకి కదా జాయిను చేస్తారు" అన్నాడు.

రంగారావు నవ్వుతూ, "అవును" అన్నాడు.

"నేనే నింపిస్తాను" అంటూ ప్రధానోపాధ్యాయులే నింపి అందించారు. రంగారావు చదివి "సంరక్షకుడు గోవిందయ్య! వీడెవడు?" అన్నారు

"మీ తమ్ముడు."

"వీడు నా కొడుకు" గర్వంగా చెప్పాడు రంగారావు.

"నాకు తెలుసునండి. మరి మీరు ఉద్యోగస్తులుకదా"

"చూడండి హెడ్మాష్టారూ! ఈ ఫీజుల కోసం— అదేదో రిజర్వేషన్సుకోసం కాదు మనం బ్రతికేది."

"అంటే?"

"ఒకడికి పుట్టి మరొకడి పేరు వ్రాయడం నాకు ఇష్టం లేదు." అంటూ రంగారావు గార్డియన్ గోవిందయ్య పేరు కొట్టేసాడు.

"సారీ సార్!" అంటూ హెడ్మాష్టారు క్షమాపణలు చెప్పుకున్నారు.

"దానికేముంది మాష్టారూ!" అన్నాడు రంగారావు.

"అయ్యా! నేను ఇంచుమించు పది గ్రామాలలో పని చేసాను. ప్రతి ఉద్యోగికూడా తండ్రిపేరు నామమాత్రంగా వ్రాసి గార్డియన్ ఎవరి పేరుతో నింపుతున్నారు? ఫీజులు కట్టే ప్రసక్తి వుండదని. మీ బి. సి. రిజర్వేషన్సు కోసం. మన ఊరిలోకూడ అందరూ అదే పని చేస్తున్నారు...." అన్నాడు ప్రధానోపాధ్యాయుడు.

రంగారావు "వ్యక్తిగతంగా నాకు ఆ పద్ధతి నచ్చదు!" అన్నాడు.

"మీ లాగే అందరూ ఉంటే ...ఈ దేశానికి మంచి రోజులు వచ్చేటట్టే!" అన్నాడు హెడ్మాష్టారు.

"అట్ల కోసం. ప్రభుత్వం ఏదో చేస్తుంది. సరే కాఫీ యండి" అని ముగించాడు రంగారావు.

* * *

ఆ రోజు హైదరాబాదు వెలమ కులస్థుల సంఘ సమావేశం జరుగుతుంది. ఉపన్యాసాలు జోరుగా సాగుతున్నాయి. ముఖ్యమంత్రి ఆ సభకు అధ్యక్షత వహించారు. చాలమంది ప్రముఖులు తమ కులాన్ని వెనుకబడిన కులాల జాబితా చేర్చాలని, ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం ఒకటి ప్రతిపాదించారు.

అధ్యక్షుడు లేచి, "ఇటువంటి ప్రతిపాదన మన కులానికి ఆత్మహత్యా సదృశమయింది. ఈ విధమైన తీర్మానాలు ఇంకెప్పుడూ చేయవద్దు." అని హెచ్చరించారు.

ఆయనే శ్రీ జలగం వెంగళరావు. ఆటువంటి మహా వ్యక్తులు నేడు ఎంత మంది ఉన్నారు??